క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ



ఎర్రిస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, సర్పంచులు

ఆదోనిరూరల్: ఆదోని తాలూకా ఎస్‌ఐగా ఎర్రిస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు వివిధ గ్రామాల సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన ఎస్‌ఐకు శుభాకాంక్షలు తెలిపారు. విరుపాపురం గ్రామ సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, సాదాపురం నాయకులు మురళి, సలకలకొండ మాజీ సర్పంచ్ మల్లికార్జున, పెద్దపెండేకల్ నాయకుడు తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

'మధ్యాహ్నం'లో మెనూ పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం మంచి పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుందని తెలిపారు. విద్యార్థులను అడిగి భోజనం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ-2 శోభరాణి, ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియల్, సర్పంచ్ పాల్‌దినకర్, పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, సీఆర్‌పీలు ఉన్నారు.

ఆర్బీఎస్ ద్వారా పింఛన్ అందజేత



మతిస్థిమితం లేని దివ్యాంగురాలికి ఆర్బీఎస్ యాప్ ద్వారా పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో కళ్లు, చెవులు, మాటలు రాని మతిస్థిమితం లేని ఓ దివ్యాంగురాలికి వలంటీర్ వెంకటేష్ ఆర్బీఎస్ ద్వారా పింఛన్ అందజేశారు. ప్రతి నెల వలంటీర్ ఇంటికి వచ్చి యాప్ ద్వారా ఆర్బీఎస్‌లో ఓకే చేయించి పింఛన్ అందిస్తున్నాడని దివ్యాంగురాలి తల్లిదండ్రులు వాచ్‌మెన్ లక్ష్మీ, నారాయణ తెలిపారు. కాగా మండలంలో 7,464 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 96 శాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన , సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి , ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు.

ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న షాబీర్ బాషా

ఆదోని సెంట్రల్: కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తిరుమలేష్ , షాబీర్‌బాషా, శీను, అఖండ, సోమశేఖర్, రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం చేపటిన నిరాహారదీక్షలు 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతుందని, వారికి సంఘీభావంగా అదే రోజు విద్యాసంస్థల బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాయకులు దస్తగిరి, మహేష్, సునీల్, వెంకటేష్, అశోక్, మల్లికార్జున. సుభాష్ పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

హొళగుంద: స్థానిక ఈబీసీ, బీసీ కాలనీలలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నారు. అందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు.

ముమ్మరంగా 'నాడు-నేడు' పనులు

- రూ.26కోట్లతో రెండో విడత మనబడి నాడు-నేడు పనులు
- పాఠశాలల్లో చివరిదశలో అదనపు గదుల నిర్మాణం
- ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి



చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో రంగప్పగట్టు ప్రాథమిక పాఠశాల



నాబార్డు నిధులతో పనులు పూర్తయిన కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కోసిగి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన నాడు-నేడు రెండో విడత పనులు మండలంలో జోరుగా సాగుతున్నాయి. మండలంలో మొదటి విడతలో 23 పాఠశాలలు ఎంపిక కాగా రూ.22 కోట్లతో పాఠశాలలను రూపుదిద్దారు. రెండో విడుత కింద 40 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 10 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి దాదాపు రూ.26 కోట్లు కేటాయించగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు రూ.15.50 కోట్ల మేర ఖర్చు చేశారు. 7 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాల రూ.16లక్షలు చొప్పున కేటాయించారు. వీటిలో 5 భవనాలు రూఫ్‌లెవెల్‌లో, మరో రెండు లెంటల్ లెవెల్‌లో పనులు సాగుతున్నాయి. ఇందులో ఒక రూమ్, ఫర్నీచర్, ఫ్రిజ్, ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. పాఠశాలల్లో అదనపు గదులు, టాయిలెట్స్ అండ్ రన్నింగ్ వాటర్, డ్రికింగ్ వాటర్ అండ్ సప్లై, ఎలక్ట్రీషియన్, మేజర్ అండర్ మైనర్ రిపేరీ, గ్రీన్ చాక్‌బోర్డు, ప్రహరీ, ఇంగ్లిష్ ల్యాబ్, కిచెన్ షెడ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.

నాబార్డు నిధులతో..

కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు గదులకు రూ.3కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. వీటితో 10 అదనపు గదులు, మేజర్ అండర్ మైన్ రిపేరీ, డిజిటల్ క్లాస్ రూమ్, ప్రార్థన స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. అదే పాఠశాలలో నాడు-నేడు కింద రూ.33 లక్షలతో 3 అదనపు గదులు నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించగా..పనులు సాగుతున్నాయి.



రంగప్పగట్టు స్కూల్‌లో కుళాయిల వద్ద నీటిని తాగుతున్న విద్యార్థులు

పాఠశాల చాలా బాగుంది



కోసిగి రంగప్పగట్టు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నా. ప్రస్తుతం మా పాఠశాల చాలా బాగుంది. కొత్త హంగులతో పాఠశాల రూపు రేఖలు మార్చేశారు. గతంలో పాఠశాలకు కష్టంగా వచ్చే వాళ్లం. ఇప్పుడు పాఠశాలకు ఇష్టంతో వస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది. – వైష్ణవి, 5వ తరగతి విద్యార్థిని, కోసిగి

తాగునీటి వసతి ఏర్పాటు చేశారు



రంగప్పగట్టు పాఠశాలలో గతంలో తాగునీటి వసతి లేక ఇంటి నుంచి వాటర్ బాటిళ్లలో నీటిని తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు బోరు వేసి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలలో ఫ్యాన్‌లు, డిజిటల్ టీవీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు పాఠశాల చాలా బాగుంది. – ఉశేనమ్మ, విద్యార్థిని

పనులు వేగంగా చేయిస్తాం

రెండవ విడుత నాడు-నేడు కింద మంజూరైన నిధులతో మండలంలోని అన్ని పాఠశాలలో వేగంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తి కావచ్చాయి. ఇంకా పెయింటింగ్, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా త్వరగా పూర్తి చేయించి అధికారులకు అప్పగిస్తాం. – రంగస్వామి, నాడు-నేడు ఏఈ, కోసిగి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉండడం వల్ల ఆదివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏడీ నాగేంద్రప్రసాద్, ఏఈ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోనున్న ఎస్‌కేడీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివశంకర్‌నగర్, మహాత్మా గాంధీ నగర్, నారాయణగుంట, మున్సిపల్ మెయిన్ రోడ్డు, జనరల్ ఆస్పత్రి లైన్, పరిశముల్లా వీధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే రోడ్లలో చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ఉన్నత తరగతులు నిర్వహించండి

ఆదోనిసెంట్రల్: మండలంలోని హనవాల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 9,10 తరగతులను నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. శనివారం ఎంఈఓ శివరాములును కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 8వ తరగతి వరకే ఉండడంతో చాలా మంది విద్యార్థులు ఉన్నత తరగతులకు దూరం అవుతున్నారని చెప్పారు. ఉన్నత చదువులకు వేరే గ్రామాలకు వెళ్లాల్సి వస్తుండటం, సరైన రవాణా సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని తెలిపారు. గ్రామంలో తరగతులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పవన్ కుమార్, దినేష్, నాగరాజు, రవితేజ, రాజు, గణేష్, శశి, మానేష్ పాల్గొన్నారు.

ఓటర్ నమోదును విజయవంతం చేయండి

- ఫారం 6, 7, 8పై అవగాహన కల్పించాలని ఆదేశం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా శని, ఆదివారాల్లో జరిగే స్పెషల్ క్యాంపింగ్ డే (ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం)ను జయప్రదం చేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ హాల్‌లో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్‌లో ప్రతిఒక్క బీఎల్‌వో 2024 జనవరి 1వ తేదీ లోపు 18 సంవత్సరాలు నిండే వారిని నూతన ఓటర్లుగా నమోదు చేయాలని చెప్పారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారినా, వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలన్నారు. ఫారం-8 ద్వారా ఓటర్‌కార్డులో పేరు, వయస్సు, జెండర్, తప్పులు, అడ్రస్ మార్పులు, చేర్పులు ఉన్న వాటిని వాటి సంబంధించిన పత్రాలను జతచేసి సమర్పించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వీరశైవ లింగాయత్ కళ్యాణ మండపం సమీపంలో ఉన్న పోలింగ్ బూత్, హవ్వన్నపేటలోని ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ పాఠశాల, భారతి విద్యాసాధన స్కూల్, ప్రభుత్వ పాఠశాల, సుమారు 18 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ క్యాంపింగ్ డే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: మండలంలోని బంటకుంట గ్రామంలో చెత్తసేకరణ కేంద్రం నిర్మాణానికి ఎంపీడీఓ సుబ్బరాజు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వల్ల ప్రత్యేంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వీటి ద్వారా వచ్చే వర్మీకం పోస్టు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కేంద్రానికి కావాల్సిన స్థలాన్ని గ్రామ సర్పంచ్ ఉచితంగా ఇవ్వడంతో శనివారం పనులు ప్రారంభిచామన్నారు. పనులు నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మండలంలోని 30 పంచాయతీలకు గాను 16చోట్ల నిర్మాణాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ, టెక్నికల్ అసిస్టెంట్ నిర్మల, సుధాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ వడ్డెరాము పాల్గొన్నారు.

• మరమ్మతులు చేయరూ!



మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.లక్షల వెచ్చించింది. ఇందులో భాగంగా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. పట్టణంలో నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఐదు ఆరు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు శుద్ధమైన తాగు నీటికి బదులు మాములు నీటినే తాగుతున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం అలీమ్ సిద్దిఖీని వివరణ కోరగా పాఠశాలలో 3 ఫేస్ పవర్ సప్లై లేకపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయని చెప్పారు. గతంలో రెండు మూడు సార్లు మరమ్మతులు చేయించినా మోటార్లు పనిచేయడం లేదన్నారు. ఈ విషయంపై పురపాలక అధికారులు, ఉన్నతాధికారులకు విన్నవించామన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా శ్రీరాములు



కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం కర్నూలు మెడికల్ కాలేజీ బ్రాంచ్ అధ్యక్షుడిగా డాక్టర్ డి.శ్రీరాములు (జనరల్ మెడిసిన్) ఎన్నికయ్యారు. అధ్యక్ష పోస్టు మినహా మిగిలిన పోస్టులన్నీ ఏకగ్రీవమయ్యాయి. శనివారం కళాశాలలోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ప్రభుత్వ వైద్యుల సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పోస్టుకు డాక్టర్ డి. శ్రీరాములు, డాక్టర్ బ్రహ్మాజీమాస్టర్ పోటీ పడ్డారు. కౌంటింగ్‌లో అధ్యక్షుడిగా డాక్టర్ డి. శ్రీరాములు నాలుగు ఓట్ల తేడాతో గెలుపొందారు. కార్యదర్శిగా డాక్టర్ కేబీ విజయమోహన్‌రెడ్డి, ట్రెజరర్‌గా డాక్టర్ డి. శ్రీనివాసులు, జనరల్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ డి. విజయానందబాబు, డాక్టర్ కె. మాధవీశ్యామల, డాక్టర్ కె. సోమప్ప, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జె. జయరామ్, డాక్టర్ ఎన్. నాగేశ్వరయ్య, డాక్టర్ ఎం. మల్లికార్జున, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ ఎం. ఉమాదేవి, డాక్టర్ ఐ. బాలసారయ్య, డాక్టర్ ఎ. శారద, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ వైకేసీ రంగయ్య, డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, డాక్టర్ జి. విశాల, డాక్టర్ కె. సునీల్‌కుమార్, డాక్టర్ వై. మురళీప్రభాకర్, డాక్టర్ బి. హేమనళిని ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎస్. వెంకటరమణ వ్యవహరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై దృష్టి సారించండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ కర్నూలు ఎస్‌ఈ (ఆపరేషన్స్) ఎం. ఉమాపతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌ఫార్మర్స్, అకౌంట్స్ విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని కపటి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. బసవేశ్వరస్వామి దేవాలయం విషయంలో రెండువర్గాలు మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. శంకర్ ఫిర్యాదు మేరకు చరణ్, కిషోర్, జయమ్మ, వాణి, ధరణి, ఊహపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత రెండో వర్గానికి చెందిన జయమ్మ ఫిర్యాదు మేరకు శంకర్, మంజునాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.మొత్తం మీద ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

కరవు మండలాల జాబితాలో ఆదోని ఉంది



ఏఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి,



బసాపురం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదోనిఅర్బన్: కరవు మండలం జాబితాలో ఆదోని మండలం ఉందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. శనివారం బసాపురం రోడ్డులోని అగ్రికల్చర్ కార్యాలయం వద్ద ఏఓ అశోక్‌కుమార్ రెడ్డితో మాట్లాడారు. ఆదోని మండలం కరవు జాబితాలో ఇప్పటికే ఉందని, ఏ పంట, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారనే అంశాలపై నివేదికలు తయారుచేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అంతేగాకుండా నీటి, వర్షాధారంగా ఎంత భూమి ఉంది, ఎంతమంది పంటలు సాగు చేసి నష్టపోయారనే వివరాలను కూడా పంపాలని సూచించిందన్నారు. కరవు మండలాల జాబితాలో ఉన్నందువల్లే ఈ వివరాలను పంపాలని ఆదేశాలిచ్చారని ఏఓ చెప్పారు.

త్వరలో తాత్కాలిక రోడ్డు వేస్తాం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు గేటు సమీపంలో బసాపురం రోడ్డు అతలాకుతలమై గుంతలతో రైతులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని, వారం రోజుల్లో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇస్కాన్ సంస్థ ఏర్పాటు చేసిన సబ్సిడీ భోజనం కార్యక్రమానికి విచ్చేసిన అనంతరం యార్డు సమీపంలోని బసాపురం రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బసాపురం రోడ్డు ప్రస్తుతం పంచాయతీ కింద ఉందన్నారు. అయితే ఎక్కువశాతం రైతులు దిగుబడులను వాహనాల్లో ఈ రహదారి గుండా యార్డుకు తీసుకొస్తారని, దీంతో యార్డు అధికారులతో మాట్లాడి వారంలోపు తాత్కాలికంగా రోడ్డు వేయిస్తామని చెప్పారు. అలాగే శాశ్వత రోడ్డు వేసేందుకు నివేదికలను తయారుచేసి పంపుతామన్నారు. యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, డైరెక్టర్‌లు, యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఉన్నారు.

కౌతాళంలో పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి చెన్నయ్య తెలిపారు. శనివారం ఆదోని ప్రధాన రహదారి, బొగ్గులప్ప డ్రాప్ ఏరియాల్లో పనులు చేపట్టారు. పనులను ఎంపీడీఓ సుబ్బారాజు పరిశీలించి పలు సూచనలు చేశారు. డ్రైనేజీల్లో చెత్తచెదారం పేరుకుపోకుండా తొలగించాలని సూచించారు. చెత్తచెదారం రోడ్లపై వేయకుండా కుండీల్లో వేయాలని, లేదా చెత్త సేకరణ కోసం వచ్చే వాహనంలోనే వేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

బ్యాంకు వద్ద చోరీ

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ముందు చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ సీఐ విక్రమసింహా తెలిపిన వివరాల మేరకు.. గురువారం కోసిగి గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి బ్యాంకులో రూ.1.20 లక్షలు డ్రా చేసుకొని బయటకు వచ్చి డబ్బు బ్యాగును బైకులో పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి మహేష్ దగ్గరకు వచ్చి కింద డబ్బులు పడ్డాయి తీసుకోండి అని చెప్పాడు. దీంతో మహేష్ కిందకు వంగి డబ్బు తీసుకొనేలోపే బండిలో ఉన్న డబ్బు సంచి తీసుకొని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

నందవరం: స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అండర్-17 బాయ్స్ అండ్ గర్ల్స్ ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. చిత్తూర్-నెల్లూరు జట్లు మధ్య మ్యాచ్ సరవత్తరంగా సాగింది. 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మరో మ్యాచ్ కర్నూలు - ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగింది. కర్నూలు జట్టు 10-0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో కృష్ణా - విజయనగరం జట్లు తలపడ్డాయి. కృష్ణా జిల్లా జట్టు 6 గోల్స్ చేసి విజయం పొందింది. నాల్గవ జట్టు గుంటూరు - శ్రీకాకుళం మధ్య జరిగింది. గుంటూరు జట్టు 4-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరామ్, టోర్నమెంట్ పర్యవేక్షకులు ప్రభాకర్, లతీఫ్, ఉమాపతి, కవిరాజు, కిషోర్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

తుగ్గలి: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బొందిమడుగులకు చెందిన దస్తగిరి(60) అనారోగ్యం, కాలికి గాయమై బాధపడుతున్నాడు. శుక్రవారం లింగనేనిదొడ్డి రైల్వే స్టేషన్‌లో రైలు దిగి పట్టాలు దాటుతుండగా మరో వైపు నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డోన్ రైల్వే పోలీసులు శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పాలస్తీనా- ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలి



సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కువినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: పాలస్తీనా, గాజాపై జరుగుతున్న దాడులను పాలస్తీనా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే ఆపేలా ప్రభుత్వాలు తమవంతు చర్యలు తీసుకోవాలని, ప్రపంచంలో శాంతి నెలకొల్పేలా కృషి చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు, వివిధ మతాల పెద్దలు కోరారు. శనివారం ఆదోని ఖాజీసాబ్ అల్తాఫ్‌హుసేన్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రపంచశాంతికి ప్రతిజ్ఞకరూ పాటుపడాలని కోరుతూ సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ మాట్లాడుతూ రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో ఆ రెండు దేశాలు ఎంతగానో నష్టపోయాయని, నేడు జరుగుతున్న ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధం వల్ల అక్కడి ప్రజలు ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాస్టర్ డేనియల్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రక్తపాతం వల్ల సాధించేది ఏమీ లేదని, ప్రపంచ దేశాల్లో శాంతికోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఆదోని ఖతిబ్‌సాబ్‌జునైద్‌హుస్మి, పెద్ద మసీదు కమిటీ చైర్మన్ సాదీరావూఫ్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ బాషా, ఎస్‌ఎంటీ హన్ను, బుద్దారెడ్డి, రామచంద్ర, తిమ్మప్ప, ఆరేకల్ రామకృష్ణ, ఇస్మాయిల్, కన్నె జగదీష్, మనియర్ యూనుస్, నారాయణపురం షేక్షావలి, మాజీ కౌన్సిలర్ షాషావలి పాల్గొన్నారు.

విద్యాభ్యాసం సమాజానికి ఉపయోగపడాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: సమాజానికి ఉపయోగపడేలా విద్యాభ్యాసం ఉండాలని విశ్రాంత అధ్యాపకుడు రామశేషయ్య తెలిపారు. ఈనెల 9వ తేదీన అనంతపురంలో జరిగే రెండవ రాష్ట్ర సేవ్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ కరపత్రాన్ని సాయి డిగ్రీ కళాశాలలో శనివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలోని పరిస్థితులను గమనించకుండా ఏకపక్షంగా జాతీయ నూతన విద్యావిధానం, ఎన్‌ఈపీ 2020 నాలుగేళ్ల డిగ్రీని ప్రవేశపెట్టడం సరి కాదన్నారు. ఉన్నత విద్య మౌలిక సూత్రాలను దెబ్బతీసేలా ఉందన్నారు. సమావేశానికి ముఖ్య ఉపన్యాసకులుగా క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీ.ఆర్. సాయిగోపాల్, ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఏ. కరుణానందన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఏఐఎస్‌ఈసీ జిల్లా కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, సభ్యులు మల్లేష్, మన్నెం అరుణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిగెట్ల మాజీ సర్పంచ్ రామిరెడ్డి మృతి



రామిరెడ్డి (ఫైల్)

తుగ్గలి: సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు గిరిగెట్ల మాజీ సర్పంచ్ తంగరడోణ రామిరెడ్డి(80)అనారోగ్యంతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని హైవే-44పై మదార్‌పురం వద్ద శనివారం లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 110 బ్యాగులలోని దాదాపు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, లారీ డ్రైవర్ మొహమ్మద్‌ను, బియ్యం అక్రమ రవాణా చేస్తున్న శోభన్‌బాబును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులు బియ్యం ఎక్కడి నుంచి ఎలా సేకరించారన్నది, ఎక్కడికి రవాణా చేస్తున్నారనే దానిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి శనివారం సర్పంచ్ హరిజన యంకప్ప చర్యలు చేపట్టారు. బోరు మోటారు చెడిపోవడంతో కొంతకాలంగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మోటారుకు సర్పంచ్ మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్) : తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్ తైక్వాండో కోచ్ కె. కార్తికేయన్ ఆకాంక్షించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్‌ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పతకాలు సాధించిన రాధిక, సుగంధిని (బంగారు) పవన్, రేవంత్ (బంగారు) ఈనెల 9 నుంచి11 వ తేదీ వరకు కడప జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.